# దారి

ఆకెళ్ళ శివప్రసాద్



విశ్వనాధాన్ని పరిచయమయిన రోజు నుండి ఓ ప్రశ్న వేయాలనుకుంటున్నాడు ముకుందం.

కానీ–

అడగాలంటే ఏదో భయం!

అయినా తనకి మొదట్నుండి తెలుసున్న వాళ్ళతో మాట్లాడాలంటేనే అదో రకమైన జంకు

కొంతమంది పరిచయమయిన కొద్ది క్షణాల కాలంలోనే గంటల కొలది 'బారీ'గా మాట్లాడేసుకుంటుంటారు అలాంటి వాళ్ళని చూసి చాలా సార్లు ఆశ్చర్యపోయాడు ముకుందం

విశ్వనాధం పరిచయమయి దాదాపు నెల దాటింది పార్కులో పరిచయం

ఆ రోజు కూడా–

యింట్లో రివాజుగానే–

'ఓ మోస్తరు ప్రపంచ యుద్ధం లాంటిది జరిగింది' తనకా వుద్యోగంలో సర్వీసు మూడేళ్ళు మించి లేదు సమస్యలు రోజు రోజుకు తెగ పెరుగుతున్నాయి అన్నీ చిక్కుముడుల్లాగే వున్నాయి !

తనకి నలుగురు సంతానం

మొదటి ఇద్దరు ఆడపిల్లలు, వాళ్ళు పెళ్ళి కెదిగి కూర్చున్నారు పెళ్ళి మాట ఎలా వున్నా, కనీసం పెళ్ళి చూపులకి రావడాన్కి కూడా చాలా మంది అంగీకరించడం లేదు

నలుగురి కాళ్ళు పట్టుకొని, 'పెళ్ళికొడుకు' వివరాలు కనుక్కొని, కష్టపడి, వెతుక్కుంటూ వెళ్తే– "అమ్మాయి ఎలా వుంటుంది?"

"ఎత్తు ఎంత?"

"నలుపా? తెలుపా?"

'చదువుకుందా? లేదా?"

"గ్రాడ్యుయేషనా పోస్ట్‌గ్రాడ్యుయేషనా?"

"వుద్యోగం చేస్తోందా? లేదా?"

"ప్రైవేట్ కంపెనీయా? గవర్నమెంట్‌లోనా?"

ఇలా లక్ష ప్రశ్నలు

అన్నింటికి 'ముద్దాయి'లా జవాబు చెప్పినా–

"సారీ బిజీలో వున్నాను ఇప్పట్లో రావడాన్కి కుదర్దు" అని మొహమ్మీద ఖండితంగా చెప్పేస్తున్నారు

ఆడపిల్లల సమస్య అందరికీ వున్నదే అని 'కాస్త' (తృప్తి కాదు!)

'సర్దు'కున్నా–

మగపిల్లలు కూడా చికాగ్గానే వున్నారు

మొదటి వాడు గ్రాడ్యుయేషన్ చదువుతున్నాడు పరీక్షలింకా నెలరోజులు లేవు కానీ–

వాడికున్న సబ్జెక్టులు ఎన్నో కూడా వాడికి సరిగ్గా తెలీదు

మొన్నో రోజు–

వాడి కాలేజీలో పని చేస్తున్నతను చెప్పాడు–

"మీ వాడు ఈ మధ్య కాలేజీకి రావడం లేదని–' తను ఆఫీసులో పర్మిషన్ అడిగి, యింటి దగ్గరున్న 'ప్లే గ్రౌండ్'లో 'క్రికెట్' వుద్ధరిస్తున్న పుత్రరత్నం మెడ పుచ్చుకొని; యింటికి లాక్కొళ్ళి, ఆ చెంపా ఈ చెంపా వాయించి– కాలేజీకి ఎందుకు వెళ్ళలేదని నిలదీస్తే–

వాడు పొగరుగా–

" కాలేజీ సరిగ్గా నడవడం లేదు నడిచినా వాళ్ళు 'పాఠాలు' చెప్పడం లేదు అయినా నాకు క్రికెటంటే యిష్టం " అన్నాడు వాడు

మాటా మాటా పెరిగింది

చిలికి చిలికి గాలివాన

ఫలితం!

పెళ్ళాం బిడ్డల మీద అసహ్యం చీకాకు విరక్తి! గుండెలో మండుతున్న అశాంతితో వుండలేక, రోడ్ల మీద 'పడి' కాళ్ళలో 'సత్తా' వున్నంత వరకు తిరిగి– యిక నడవలేక– దగ్గర్లో వున్న పార్క్‌కి చేరుకున్నాడు

సరిగ్గా–

ఆ రోజే విశ్వనాధంతో పరిచయం!

అక్కడే ఆడుకుంటున్న చిన్నపిల్లలతో 'కేరింతలు' కొడుతున్నాడు విశ్వనాదం వాళ్ళతో మాట్లాడుతున్నాడు మాట్లాడుతూ నిర్మలంగా నవ్వుతున్నాడు!

"జీవితంలో ఏరకమైన బాదరబందీలు లేని మనిషి" అని అనుకున్నాడు విశ్వనాధాన్ని చూసి ముకుందం పిల్లలతో ఆటలయ్యాకా

అక్కడే కూర్చున్న ముకుందాన్ని పలకరించాడు విశ్వనాధం క్రమేణా పరిచయం పెరిగింది

రోజు ఆఫీసు నుండి యింటికి వచ్చాకా, క్రమం తప్పకుండా పార్క్‌కి వెళుతున్నాడు ముకుందం

విశ్వనాధం ఎప్పుడూ సరదాగా, ఆనందంగా,

పుత్సాహంగా ఏదో ఒకటి మాట్లాడేవాడు !

అలా మాట్లాడే విశ్వనాధాన్ని చూసి ఆశ్చర్య పోయాడు ముకుందం

'ఏమిటీ విచిత్రం విశ్వనాధానికి అసలు సమస్యలే లేవా? దాదాపు తన వయస్సుడే మహాఅయితే రెండు మూడేళ్ళు పెద్ద కావొచ్చు తనకి లక్ష సమస్యలు ఇంత హాయిగా ఆనందంగా ఎలా వుండగల్గుతున్నాడు విశ్వనాథం?"

మొదటి సారి ఈ ప్రశ్న తనలో వుదయించినప్పుడు–

"ఛ! అడిగితే ఏం బావుంటుంది" అనుకున్నాడు

కానీ–

విశ్వనాథం రోజు రోజుకి చూపెడుతున్న చనువు, ఆ ప్రశ్న గుండెల్లో ప్రతిధ్వనించేటట్టు చేస్తోంది ఇక వుండబట్ట లేకపోతున్నాడు ముకుందం

ఈ వుండబట్టలేక పోవడాన్కి కారణం మరొకటి కూడా వుంది అది నిజానికి ముకుందానికి కూడా తెలీదు

అదే

'మానవ నైజం!'

'తను కష్టపడుతున్నాడు ఎదుటివాడు సుఖపడుతున్నాడు తనెందుకు కష్టపడాలి?వాడెందుకు సుఖపడాలి' అనే 'సహజ'మైన మానవగుణం లేకపోవడాన్కి ముకుందమేమి 'మానవాతీతుడు' కాడు! తను అడగవలసిన ప్రశ్నని నిముషానికి నూట ఇరవై సార్లు 'జపించి', ఆ రోజు ఎలాగైనా అడగాలని నిశ్చయించుకున్నాడు ముకుందం

సాయింత్రం తొందరగా పార్కు చేరుకున్నాడు సమయం ఆరు దాటింది.

రోజు ఈ సమయానికి వచ్చేవాడు విశ్వనాథం !

ఇవాళేమయ్యింది?

విశ్వనాథం రాక కోసం ఎదురు చూస్తున్నాడు ముకుందం రోజు ఆడుకోవడాన్కి వచ్చే పిల్లలు కూడా ఆడుకొని వెళ్ళిపోయారు

తనకి తెలీకుండానే మరో గంట గడిచింది

మెల్లగా నక్షత్రాలు కళ్ళు విప్పుతున్నాయి, నీలాకాశంలో మరో అరగంట చూసి–

"ఇవాళ రాడేమో?" అని మెల్లగా బైటకి అడుగులు వేశాడు ముకుందం వీధి దీపంలో 'దారి' స్పష్టంగా కన్పిస్తోంది !

ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న ముకుందం కాళ్ళకి 'బంధం' పడ్డట్టు ఆగిపోయాడు ఎదురుగా విశ్వనాథం వస్తున్నాడు !

విశ్వనాథం ముకుందం దగ్గర కొచ్చి మామూలుగానే నవ్వుతూ పలకరించాడు

రెండు నిముషాల తరువాత ఇక ఆపుకోలేక అడిగేశాడు

"జీవితంలో ఇంత హాయిగా ఎలా బ్రతుకుతున్నారు? అసలు మీకు సమస్యలే లేవా?" అని

విశ్వనాథం మెల్లగా నవ్వాడు

ముకుందం ప్రశ్న 'రిపీట్' చేశాడు

తన పరిస్థితిని గురించి క్లుప్తంగా చెప్పి, "నా కన్నీ సమస్యలే" అన్నాడు బాధగా–

క్షణం తరువాత–

"చూడు ముకుందం, జీవితమంటే ఒకరికి కష్టంగా ఒకరికి సుఖంగా వుండదు అందరికి రెండూ వుంటాయి ఇక ఆనందమూ? హాయీ అంటావా? అవి మన చేతుల్లోనే వున్నాయి నిజానికి నీ జీవన విధానం వేరు– నాది వేరు మనిద్దరివి విభిన్నమైన దారులు నువ్వు చెప్పిందానిబట్టి నా కర్థమయిందేమిటంటే నీలో లేనిది నాలో వున్నది ఒక్కటే అదే శాంతం నాకూ వున్నాయి సమస్యలు కానీ నా కుటుంబ విషయానికొస్తే, చిన్న సమస్య అయినా, పెద్దదైనా కుటుంబ సభ్యులందరం కూర్చొని సావధానంగా చర్చించుకొని పరిష్కారం కోసం ఆలోచిస్తాం నా బిడ్డలు ఈ తరానికి ప్రతినిధులైతే నేనూ, నా భార్యా అనుభవ తరానికి చెందినవాళ్ళం నిజమే అన్ని సమస్యలు పరిష్కరించలేం కానీ శాంతంగా ఆలోచిస్తే కనీసం సమస్యలని ఎదుర్కొనే ధైర్యమైనా వస్తుంది నా అభిప్రాయం ప్రకారం ఇదే నీ కుటుంబానికి, నా కుటుంబానికి వున్న తేడా " అన్నాడు నిర్మలంగా నవ్వుతూ

ముకుందం రెండు క్షణాలు మాట్లాడలేదు అప్పటివరకు కళ్ళెదురుగా వున్నది కన్పించినట్టుగా వుంది అతనికి

విశ్వనాథమన్న ప్రతిమాటా అతని గుండెల్లో నాటుకుంది

శాంతానికంత మహత్యముందా ?

ఆలోచనలో పడ్డాడు ముకుందం

"ఆ( నీ కొక విషయం చెప్పడం మర్చిపోయాను "

విశ్వనాథం మాటలకి ముకుందం ఆలోచన చెదిరింది

"ఇవాళే మా అమ్మాయికి పెళ్ళి చూపులయ్యాయి అందుకే ఇక్కడికి రావడం ఆలస్యమయ్యింది కట్నం కాస్త ఎక్కువగానే అడిగారు అయినా చూద్దాం అయితే ఈ సంబంధం కాకపోతే మరొకటి " అన్నాడు చాలా తేలిగ్గావిశ్వనాదం

ముకుందం ప్రశ్నకి స్పష్టంగా జవాబు దొరికింది

కృష్ణపక్షపు వెన్నెలయినా 'దారి' అతనికి స్పష్టంగా కన్పిస్తోంది తన 'యింటికి' చేరుకోవడాన్కి! ●

## విదేశీ చందా రేట్లు

మీరు మీ "వాళ్ళకి" విదేశాలకి వీక్లీ కాని, కలువబాల కాని పంపించాలనుకుంటే యీ క్రింది విధంగా వారి చిరునామాలతో మీరు చందాలు మాకు పంపండి.

### ఆంధ్ర సచిత్ర వార పత్రిక

| కాలము | విమానం ద్వారా | సముద్రం ద్వారా |
|---|---|---|
| సంవత్సరానికి | రు. 1,196/- | రు. 730/- |
| ఆరు నెలలకి | రు. 598/- | రు. 365/- |

### కలువబాల

| కాలము | విమానం ద్వారా | సముద్రం ద్వారా |
|---|---|---|
| సంవత్సరానికి | రు. 540/- | రు. 324/- |
| ఆరు నెలలకి | రు. 270/- | రు. 162/- |